క్లుప్తంగా

పంటల వివరాల నమోదు తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న నూతన్‌కుమార్

నారాయణఖేడ్: రైతులు సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఏడీఏ నూతన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఏఈఓ రఘుతో కలిసి ర్యాకల్ శివారులోని జొన్న, వరి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం జొన్న పంటలో పేనుబంక, వరిలో కాండం తొలుచు, మొగి పురుగులు ఆశించినట్లు గుర్తించారు. నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరించారు. రైతులకు అవగాహన కల్పించి సందేహాలను నివృత్తి చేశారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం


ఉద్యోగులను సన్మానించిన అధికారులు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఐకేపీ సీసీ శేఖర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని వెంకటాపూర్‌లో అంగన్‌వాడీ, ఐకేపీ, పంచాయతీ మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. ప్రతి మహిళా ఆర్థికంగా సాధికారత సాధించి సొంత కాళ్లపై నిలబడేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పొదుపు సంఘాల ద్వారా నూతనంగా వ్యాపారాలు చేసి ఆర్థిక పురోగతిని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తాం


పనులను ప్రారంభించిన ఎంపీడీఓ యాదగిరి

సంగారెడ్డి టౌన్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇరిగిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మొదటి విడతగా 98 మంది ఎంపికయ్యారని.. అందులో 29 మంది పనులు ప్రారంభించారన్నారు. నిర్మాణానికి కావాల్సిన వస్తువులను ప్రభుత్వమే అందిస్తుందని తెలిపారు. అనంతరం నిర్మాణానికి ముగ్గును పోసి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ పరిశీలన


హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

కల్హేర్(నారాయణఖేడ్): హాస్టల్ విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించనున్నట్లు కల్హేర్ ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం కల్హేర్‌లో ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ చేశారు. స్టోర్ రూం, వంట గది, డైనింగ్ హాల్, మూత్రశాలలు పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేయాలని సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ కిషన్, పంచాయతీ కార్యదర్శి కృష్ణచారి పాల్గొన్నారు.

ఘనంగా మహా చండియాగం

వట్‌పల్లి(అందోల్): మండలంలోని షాద్‌నగర్ గ్రామంలో పోలేరమ్మ తొమ్మిదవ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహా చండియాగాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటగా అమ్మవారికి అభిషేకం, మహాంకాళి , మహాలక్ష్మి, సరస్వతీ, పార్వతీపరమేశ్వరుల సర్వతోభద్రత రోహణం, మహా మృత్యుంజయ హోమం వంటి కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణ మధ్య సాగింది. విశేషంగా నిర్వహించిన చండియాగంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఫ్లైఓవర్ ప్రారంభానికి సిద్ధం చేయండి

ఎంపీ రఘునందన్ రావు


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తా వద్ద జాతీయరహదారిపై నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఫ్లైఓవర్ పనులను జీహెచ్‌ఎంసీ, జాతీయ రహదారుల శాఖ, ట్రాఫిక్, భెల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లై ఓవర్ పిల్లర్స్‌కు పెయింటింగ్, మొక్కలతో అందంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. త్వరలో కేంద్ర రోడ్లు, రవాణా, రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమార్‌స్వామి చేతుల మీదగా ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. పనులను పెండింగ్‌లో పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, ఫ్లైఓవర్ కింద ఉన్న అంబేడ్కర్ విగ్రహంతో పాటు పార్కు అభివృద్ధికి భెల్ ఎస్‌సీ, ఎస్‌టీ అసోసియేషన్, భెల్ యాజమాన్యం విగ్రహానికి అనువైన స్థలంలో ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటే కేంద్రం నుంచి అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే లింగంపల్లి చౌరస్తా సమీపం నాలాను అక్రమించి చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆదేశించారు. భెల్ చౌరస్తా లోని నాలా పైభాగం నుంచి శ్రీదేవి థియేటర్ మీదగా అమీన్‌పూర్ వరకు 100ఫీట్ల రోడ్డు నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం బెల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బెల్ పరిశ్రమలోని భారీ ఉత్పత్తులను తరలించే భారీట్రాలీ వాహనాలు జాతీయ రహదారిపై సులువుగా యుటర్న్ తీసుకునేందుకు అనువుగా రోడ్డు విస్తరణ చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలియజేశారు.

అధికారుల తీరుపై అసహనం


ఎంపీడీఓ ఆఫీస్ ఎదుట బైఠాయించిన కూలీలు

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధిహామీ అధికారుల పనితీరుపై కూలీలు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని తుమ్మన్‌పల్లి గ్రామస్తులు తమకు కొన్ని రోజులుగా పనులు కల్పించడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ ఝరాసంగం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం ఎంపీడీఓ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ.. గతంలో తుమ్మన్‌పల్లి పంచాయతీ పరిధిలో కప్పాడ్ గ్రామం, సంగం(కె) గ్రామాలు విలీనమై ఉండేవి. కప్పడ్ గ్రామానికి చెందిన వ్యక్తిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించారు. ప్రస్తుతం కప్పాడ్ ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటైంది. ఈ క్రమంలో కొన్ని రోజులుగా ఫీల్డ్ అసిస్టెంట్ తమ గ్రామానికి పనులు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తూ తన సొంత గ్రామంలో కప్పడ్ గ్రామం వారికే పనులు కల్పిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా తాము పనులు చేసిన కూడా వాటి కొలతలు సరిగ్గా చేపట్టడం లేదని విమర్శించారు. స్పందించిన ఎంపీడీఓ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒక గంట వ్యవధిలో డిమాండ్ సిద్ధం చేసి శనివారం నుంచి పనులు కల్పించాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు టెక్నికల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

పంచాయతీ కార్మికుల బకాయిలు చెల్లించండి


ఎంపీడీఓ ఆఫీస్ ఎదుట కార్మికుల నిరసన


నారాయణఖేడ్: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): పంచాయతీ కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించాలని శుక్రవారం కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ ప్రకటించిన విధంగా జీఓ 60 ప్రకారం వేతనాలను చెల్లించాలన్నారు. కార్మికుల వేతనాలకు ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంటు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదయ్య, ప్రవీణ్, విఠల్, మాణయ్య, బాలమణి, మహేశ్, రమేశ్, శంకర్, రహీం, బేతయ్య, సంజీవుల పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ లక్ష్మికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. గత నాలుగు నెలల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్, నాయకుల శేఖర్, సంజీవులు, రాములు, శివయ్య, రాజు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా

నారాయణఖేడ్: గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి నల్లవల్లి రమేష్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. పదిహేనేళ్లుగా కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని, ప్రస్తుతం పెరిగిన ధరలతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

హత్నూర(సంగారెడ్డి): బైక్ అదుపుతప్పి పడి యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన చాకలి శివకుమార్ (25) సంగారెడ్డిలోని ఓ స్కూలు బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం బస్సు స్కూల్‌లో పెట్టి బైక్ పై స్వగ్రామం మల్కాపూర్‌కు వస్తున్నాడు. గ్రామ శివారులోకి రాగానే ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి చాకలి యాదమ్మ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మినీస్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయింపు


ధ్రువపత్రం అందిస్తున్న తహసీల్దార్

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రం హత్నూరలో మినీస్టేడియం నిర్మాణానికి భూమిని కేటాయిస్తూ స్పోర్ట్స్ అథారిటీ జిల్లా యువజన క్రీడలశాఖకు తహసీల్దార్ ఫర్హీన్ షేక్ ధ్రువపత్రం శుక్రవారం అందజేశారు. గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 116లో నాలుగు ఎకరాల 20 గుంటల భూమిని స్టేడియం నిర్మాణానికి కేటాయించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. దీంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఖాసిం బేగ్, జూనియర్ అసిస్టెంట్ అభినయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ దావూద్ అహ్మద్, జూనియర్ అసిస్టెంట్ నారాయణ, హత్నూర స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

11న మహిళా దినోత్సవ వేడుకలు

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో మార్చి11న డివిజన్‌లోని జీహెచ్‌ఎంసీ ఫంక్షన్‌హాల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ కుమార్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం జేపీ కాలనీలో మహిళలతో ఆయన మాట్లాడారు. మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేస్తామన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఎంఈఓ శంకర్


బేటి బచావో బేటి పడావో ప్లకార్డుల ప్రదర్శన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎంఈఓ శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై, మహిళ ఉద్యోగులైన నిజాంపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజశ్రీ, ఉపాధ్యాయినీలు, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మీనా, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, హెల్పర్ సుగుణమ్మలను ఘనంగా శాలువాతో సన్మానించారు. అనంతరం మహిళా సాధికారతపై విద్యార్థులు ప్రదర్శించిన ప్లకార్డులు అతిథులను ఆకట్టుకున్నాయి. ప్రతిభను చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 14మందికి జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు జిల్లా న్యాయస్థానం జరిమానా విధించింది. సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. గురువారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి, పాత బస్టాంట్, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 14మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం సంగారెడ్డి జిల్లా కోర్టు హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి ఒకరికి రూ.2000, ఏడుగురికి రూ.1500, మిగతా ఆరుగురికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అభయహస్తం పథకం అమలు చేయాలని ధర్నా


ధర్నాలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ ప్రభుత్వం హామీ మేరకు అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేసి వినతిపత్రాన్ని అందజేసి.. రాజీవ్‌చౌక్ సమీపంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దళితబంధు పథకంలో భాగంగా దళితుల ఖాతాల్లో రూ.3 లక్షల చొప్పున జమ చేయగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వెనక్కి తీసుకుందని ఆరోపించారు. ఆ నిధులను మళ్లీ దళితుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, ఖేడ్, మనూరు మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పరమేష్, విఠల్‌రావు, మాజీ కౌన్సిలర్లు అభిషేక్ షెట్కార్, విఠల్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నగేష్, గోపాల్, సంగప్ప, చెన్‌బసప్ప, మల్గొండ, అంజాగౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్


మహిళలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కంది (సంగారెడ్డి): ప్రజా సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ ఆరోపించారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని ఏర్దనూర్, ఇప్పలగడ్డ తండా, ఏర్దనూర్ తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాధుడే కరువైయ్యారని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో.కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింలు, శ్రీనివాస్, మండల నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలి

జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మశ్చేందర్


జొన్న పంటను పరిశీలిస్తున్న మశ్చేందర్, తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎస్‌ఆర్‌వి, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మార్డి, కల్హేర్, ఇందిరానగర్, కృష్ణాపూర్ గ్రామాల్లో ఎండుతున్న జొన్న పంటను పరిశీలించారు. నీటి సరఫరా లేక దాదాపు 1000 ఎకరాలు జొన్న పంట ఎండుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నల్లవాగు ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేసి మిగిలిన పంటలు కాపాడాలని కోరారు. తహసీల్దార్ శివశ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, నాయకులు అమ్యనాయక్, రాములు, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, భూమయ్య పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన తప్పనిసరి

ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ


న్యూట్రిషన్ ఫుడ్‌ను అందజేస్తున్న సత్యనారాయణ

పటాన్‌చెరు టౌన్: క్షయవ్యాధిపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రామచంద్రపురం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో టీబీ క్యాంపెయిన్‌లో భాగంగా క్షయపై అవగాహన కల్పించారు. క్షయవ్యాధి మందులు వాడుతున్న వారికి రోగనిరోధక శక్తి పెంచేందుకు న్యూట్రిషన్ సంబంధించిన పదార్థాలను అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. క్షయవ్యాధి వచ్చిన వారు భయపడవద్దని దానికి సరైన మందులు వాడితే తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దేవేందర్ రాజ్, భవ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం జయ విజ్ఞాన భారతి సొసైటీ నిర్వాహకులు విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పట్టణంలోని పలు డిగ్రీ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'ట్రయినింగ్ థ మైండ్ ఫర్ బ్రయిట్ ఫ్యూచర్' అనే అంశంపై వ్యాస రచన, చిత్రలేఖనం, ఉపన్యాసం పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బస్వరాజ్, నిర్వాహకులు నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ హరికుమార్ పాల్గొన్నారు.

◆ ఉపాధి కూలీలకు అవగాహన

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తుర్కవడ్గాం శివారులో శుక్రవారం ఉపాధి కూలీలకు గరిష్ఠ వేతనంపై ఎంపీడీఓ సత్తయ్య అవగాహన కల్పించారు. గుళికరాళ్ల కట్టలు వేయడం పొడువు, వెడల్పు, ఎత్తు ఎంత ఉండాలనే విషయం కూలీలకు తెలిపారు. కొలతల ప్రకారం పని చేయించి వేతనం గరిష్ఠంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ నర్సింలుకు ఆదేశించారు.

◆ హామీలను విస్మరించిన ప్రభుత్వం

జహీరాబాద్ టౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా.. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సింలు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ .. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, అనేక హామీలు ఇచ్చిందన్నారు. పింఛన్లు రూ.4 వేలకు పెంచుతామని చెప్పి ఉన్న పింఛన్లు ప్రతి సరిగ్గా ఇవ్వడం లేదన్నారు.

◆ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభం

హత్నూర (సంగారెడ్డి): మండల కేంద్రంలో నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు విగ్రహ ప్రతిష్ఠ మహోత్స వ కార్యక్రమాలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీతా రామచంద్రస్వామి, ధ్వజస్తంభం ప్రతిష్ఠను మాధవానంద సరస్వతి స్వామీజీ ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ స్వయం పాలన దినోత్సవం

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వయం పాలన దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, డీఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుగా ఎలా వ్యవహరిస్తారో తోటి విద్యార్థులకు వేషధారణతో తెలియజేశారు. కలెక్టర్‌గా అనుశ్రీ, డీఈఓగా మహేంద్ర, ఎంఈఓ సాయితేజ, ప్రధానోపాధ్యాయులుగా మేఘన వ్యవహరించారు.

◆ ఘనంగా విగ్రహ పునఃప్రతిష్ఠాపన

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని కల్వకుంట కాలనీలో దుర్గాదేవి ఆలయంలో దుర్గాదేవి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి పూజ తదితర కార్యక్రమాలను పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. దుర్గాదేవి ఆలయ ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

◆ పత్తిసాగులో అధిక సాంద్రత పద్ధతే మేలు

వట్‌పల్లి(అందోల్): పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతిని పాటించడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని మధ్య తెలంగాణ సహా పరిశోధన సంచాలకులు డా.ఉమారెడ్డి సూచించారు. శుక్రవారం అందోల్ మండల పరిధిలోని సంగుపేట ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్‌మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రైతులతో మాట్లాడారు.. సాధారణ పత్తి సాగు కంటే ఈ అధిక సాంద్రత పత్తి సాగు పద్ధతిలో సాగు చేస్తే మొక్కల సంఖ్యతో పాటు పూత కాత ఎక్కువగా వచ్చి మేలైన దిగుబడి వస్తుందన్నారు. పంట కాలం కూడా తక్కువగా ఉండి పంట ఒకేసారి చేతికి వస్తుందన్నారు. ప్రత్తి పంటపై ఎక్కువ ప్రభావం చూపే గులాబీ, కాయ తొలుచు పురుగు భారీ నుంచి తప్పించుకొని నికర ఆదాయం పొందవచ్చని తెలియజేశారు.

◆ ఇంగ్లిష్ డిక్షనరీలు పంపిణీ

నారాయణఖేడ్: మండలంలోని హన్మంతరావు పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు సేల్స్‌ఫోర్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ, సేవోద్గమ్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఇంగ్లిష్ డిక్షనరీలు పంపిణీ చేశారు. ఇంగ్లీష్ బాషను పెంపొందించుకోవడానికి డిక్షనరీలు తమకు ఎంతగానో ఉపయోగపడతాయని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సదాశివపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


కంగ్టి : తడ్కల్‌లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన సిబ్బంది

మహిళలను గౌరవించడం సంప్రదాయం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలో పలువురు మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మహిళలను గౌరవించడం మన సంప్రదాయమన్నారు. మహిళా సాధికారితతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని కొనియాడారు.


జహీరాబాద్ టౌన్: ట్రాక్టర్‌పై కూర్చున్న మహిళలు


రాయికోడ్ : జ్ఞాపికలను అందజేసిన హెచ్‌ఎం